# ఉరిశిక్ష

నేనేదో మహా అనుభవం ఉన్నవాణ్నని కాదుగానీ, రకరకాల మనుషులతో నాకూ పరిచయం వుంది. కొందరితో స్నేహం చేశాను. కొందరిని చాలా ఆప్తులుగా భావించాను. ఇంకో బాపతు జనాన్ని వుంచవలసినంత దూరంగానూ వుంచాను. లోకంలో రకరకాల మనస్తత్వాలున్న వారుంటారని, నాకు ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఎందుకంటే - నాకున్న పరిచయస్థుల్లో, చాలా రకాలవారూ, అనేక వర్గాలకు చెందినవారూ వున్నారు. వారి వారి అభిప్రాయాలతో, నాకు ఏకీభావం కుదరని సందర్భాలు బొచ్చెడున్నాయి. అంతమాత్రాన వారంతా నా విరోధులని, నే నెట్లా అనను?

ఎవరి గొడవవారిదీ, ఎవరి కష్టసుఖాలు వారివీను? నేను ఆర్చేవాణ్ణీ, తీర్చేవాణ్ణీ కాదు. ఇట్లా సరిపెట్టుకొనే, నేను శివరామయ్యగార్ని ఏమీ అనేవాణ్ణి కాదు. చూడ్డానికి శివరామయ్య చాలా సాత్వికుడుగానూ, మాంఛి

వ్యవహారవేత్తగానూ వుండేవాడు. భాగ్యమ్మగారు గూడా ఆయనకు తగ్గదే ననిపించింది. అదీగాక - వాళ్ళు చాలాకాలం క్రిందటే మద్రాసులో స్థిరపడిపోయిన తెలుగువాళ్ళు. సగం అందుకే నే నా యింట్లో ప్రవేశించాను.

ఏదైనా తింటేనేగానీ రుచి తెలియదు; దిగితేగానీ లోతు తెలియదు. ఆ ఇంట్లో మూణ్నెల్లపాటు, అప్పసంగా నేనుండకపోయినట్లయితే, శివరామయ్య ఇలాంటివాడని-హరిహరాదులు చెప్పినా నమ్మేవాణ్నిగాదు. పైకి సాధువులుగా కనిపించేవారిలో, ఎంతటి రాక్షసత్వం దాగివుండటానికి అవకాశం వుందో, ఆయన్ను చూసిందాకా నాకు తెలియదు.

భార్యాభర్త లన్న తరవాత, మాటా మాటా రావడమూ, కీచులాడుకోవడమూ", సహజం కావచ్చు. వాళ్ళ గొడవతో మన కెందుకులెస్తూ - అనే; వాళ్ళ కీచులాటల్లో నేను వేలుబెట్టేవాణ్ని కాదు. నా భార్యను కూడా అటుకేసి వెళ్ళవద్దని గట్టిగా చెప్పాను.

భార్యల్ని వేపుకు తినడంగూడా వ్యాధి కిందికే వస్తే, శివరామయ్య ఆ జబ్బుతో బాగా తీసుకొంటున్న వాడి కిందికే వస్తాడు. ఆయన, పెళ్ళాన్ని అనరాని మాట లనేవాడు. నిమిష నిమిషానికీ, కొట్టటానికి మీదిమీదికి పొయ్యేవాడు. ఆయనున్న కాసేపూ ఇల్లు యుద్ధరంగంలా వుండేది.

నే నిది చాలాకాలం భరించాను. చాలాకాలం పస్తా యించాను. ఆఖరికి వుండబట్టలేక, ఒకరోజున తెగబడ్డాను.

'అది నా స్వంత విషయం! ఇందులో మీ జోక్య మేమీ లేదు' అన్నాడాయన.

ఇలాంటి సమాధానమే వస్తుందని నాకు తెలుసు. అప్పుడు నేను నోరు మూసుకోవలసి వస్తుందనికూడా తెలుసు. ఇన్ని తెలిసుండి కూడా మరెందుకు తల దూర్చవయ్యా - అని, నన్నడక్కండి! భాగ్యమ్మపడే చిత్రహింసలు చూడ లేక నే తల దూర్చాను.

నే నలా జోక్యం చేసుకోవడం చాలా మంచిదే అయింది. శివరామయ్య, పెళ్ళాన్ని కాల్చుకు తినడం తగ్గి పోయింది. ఓ మంచిపని చేశానన్న సంతృప్తి కలిగింది నాకు.

అయితే - ఇంతకు రెండింతలు, ఆమెను రహస్యంగా వేధించుకు తింటున్నాడని, భాగ్యమ్మగారు చెప్పిందాకా నాకు తెలియలేదు. ఆమె నా దగ్గర, తన గోడంతా వెళ్ళ బోసుకొంది.

'అయ్యో, నాయనా! నువ్వలా నన్ను వెనకేసుకురాక పోయినా బాగుండును.' అని కంట తడిపెట్టుకొంది భాగ్యమ్మ గారు.

'ఏమయిం దేమిటండి?' అన్నాను.

'ఆ, పాపిష్టి మాటలన్నీ నా నోట మళ్ళా ఎందుకు చెప్పిస్తావు నాయనా !' అన్నదామె, తప్పుకొంటూ.

నేను మా ఆవిణ్ని పిలిచి అడిగాను !

'అః, ఈ మొగజాతి కేముందీ ! పెళ్లాల్ని కాల్చుకు తినడ మొక్కటే చాతవును,' అన్నదావిడ.

'అది సరేనే ! భాగ్యమ్మగారు నన్ను చూసి, కళ్ళనీళ్లు పెట్టుకొంటుం దేమిటీ ? నేనేం చేశాను ?' అన్నాను.

"అప్పటికీ నేను ఒద్దు మొర్రో అంటుంటిని. నా మాట వినక పోతిరి. అనవసరంగా వెళ్ళి వేలు పెడితిరి. ఇప్పుడు భాగ్యమ్మగారి పీకలమీది కొచ్చింది... అదిగాదండీ! మంచివాళ్ళతో మంచిగానీ, ఇలాంటి లుచ్చాలతో మంచేమిటండీ నా బొంద ? 'వాడికీ నీకూ ఏమీలేకపోతే, వాడెందుకు నీ తరఫున వస్తాడూ' అన్నాట్ట శివరామయ్య. 'ఈ ఉద్దేశంతోనేనా, వాడిదగ్గర అడ్వాన్సు పుచ్చుకొన్నదీ!' అన్నాట్ట. 'ఇలా ఎంతకాలం నుంచి రంకు సాగిస్తున్నావ్ ?' అన్నాట్ట. ఆ మానవురాలు, నిన్నటిన్నించీ, గంగ ముట్టకుండా వుంది ! మీ రేం చేసినా, ఇలాగే చేస్తారు. దోవనబొయ్యే తద్దినాన్ని నెత్తికి చుట్టుకొన్నారు. అనుభవించండి!" అన్నదావిడ.

భార్యల్ని అనుమానించే భర్తలు నాకు తెలుసు.

అలాంటి భర్తలు, పెళ్ళాల్ని పెట్టే రంప కోతా నాకు తెలుసు. కాని ఇదేమిటి? ఆవిడకూ నాకు పొత్తేమిటి? కనీసం ఆవిడ కొడుకు వయస్సు కూడా నాకు లేదే?

శివరామయ్య ముఖం చూడ్డానికే డోకేసింది. ఇలాంటి దగుల్బాజీ కొంపలో ఒక్క క్షణం గూడా వుండ గూడదనుకొన్నాను. ఇప్పుడే ఇంతమాట అన్నవాడు - రేపు ఇంకేమైనా అంటాడు.

ఆ తెల్లవారే, ఇంకో ఇంట్లోకి మారాను. కనీసం మాట మాత్రమైనా 'ఎందుకు మారుతున్నా' రని శివరామయ్య అడగ లేదు. ఆయన ముఖం చూస్తే, 'ఈ పీడా ఎప్పుడు వదిలిపోతుంది భగవంతుడా' అన్నట్టుంది.

అయితే వారం తర్వాత గాని నాకు అసలు సంగతి తెలియ లేదు. నేను ఖాళీ చేసిన సాయంత్రమే, నాకంటే పదిహేను రూపాయలు ఎక్కువ అద్దెకు శర్మ ఆ యింట్లో చేరాడు.

శివరామయ్య, భార్యను ఎందుకు అనుమానించిందీ అప్పుడు నా కర్థమయింది. రేపు శర్మకన్న మరో అయిదు రూపాయలు ఎక్కువిచ్చేవాడు దొరికినప్పుడు, శివరామయ్య, మళ్ళీ భార్యను అనుమానిస్తాడు. ఆవిడ శర్మముందు, మళ్ళీ కళ్ళవెంట నీళ్ళు పెట్టుకొంటుంది.

నాకు పట్టుకొన్న బాధల్లా ఒక్కటే - మొగవాడు గనక శివరామయ్య ఏదో అఘోరించాడు; ఈ భాగ్యమ్మ కెట్లా బుద్ధిలేదా - అని ?